


బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

పొదుపు మంత్రం.. అభివృద్ధి సూత్రం..!

- ఆర్థిక క్రమశిక్షణకు సిద్ధూ పలు సూత్రాలు
- ఆర్థికం గాడి తప్పకుండా కీలక విధానాలు
- లోటు పూడ్చుకునేందుకు కసరత్తు
- రెవెన్యూ పెంపునకు పలు ప్రణాళికలు




బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టాలని సీఎం సిద్దరామయ్య నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఓ వైపు పలు శాఖల్లో పొదుపు పాటిస్తూనే అభివృద్ధికి పలు విధానాలు పాటించనున్నట్లు తెలుస్తోంది. రెండురోజులక్రిందట 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను 4.09 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2024-25 బడ్జెట్‌తో పోలిస్తే 10.39 శాతం పెరిగింది. జాతీయ జీడీపీ 6.2గా ఉండగా రాష్ట్ర జీడీపీ 7.4 గా కొనసాగింది. జీడీపీని ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే సమతుల్యత పాటించడం, వనరులను పెంపొందించుకోవడంతోపాటు ఖర్చులకు క్రమశిక్షణ పాటించాలని ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. గత బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన అంచనాలు ఆశాజనకంగానే ఉన్నాయి. చివరికి జమా, ఖర్చుల్లో కూడా భారీ వ్యత్యాసం రాలేదు. అందుకే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సుభద్రంగా ఉందని చెప్పవచ్చు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్ర బడ్జెట్ సమతుల్యతకు నిరంతరంగా రెవెన్యూలోటు అగాథం కాకుండా అప్రమత్తమయ్యారు.

రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక క్రమశిక్షణకు పలు మార్గదర్శకాలు పాటించాలని నిర్ణయించారు. వాటిలో ప్రధానంగా వనరులు సృష్టించుకోవడం, పన్నుల వ్యవస్థను బలోపేతం చేసుకోవడం, జీఎస్టీ వసూళ్లు పెంచుకోవడంపై దృష్టి సారించదలిచారు. ఆస్తుల నగదీకరణ, పన్నుయేతర రెవెన్యూను పెంచుకోదలిచారు.

- రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఒకే రకమైన అభివృద్ధి లేదు. కల్యాణ కర్ణాటక, కిత్తూరు కర్ణాటక జిల్లాలు బాగా వెనుకబడిన ప్రాంతాలు. బెంగళూరు, మైసూరు, తీర ప్రాంత జిల్లాలు అన్నివిధాలా ప్రగతిదశలో ఉన్నాయి. ప్రాంతీయ అభివృద్ధిని పెంపొందించడంతోపాటు కేవలం రాజధాని బెంగళూరుకే పరిమితం కాకుండా ఇతర నగరాలు, ప్రాంతాల్లో పెట్టుబడులను సాధించదలిచారు. సుస్థిరమైన నగరీకరణ, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక క్లస్టర్‌లు, ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలలోనూ శాశ్వతమైన పరిశ్రమలు ఏర్పాటు చేయదలిచారు.
- ఉత్పాదనా రంగానికి మాత్రమే రుణాలను వినియోగించాలని నిర్ణయించారు. అప్పులను ఇష్టారాజ్యంగా కాకుండా ప్రాధాన్యతపరమైన అంశాలకు కేటాయించనున్నారు. పెట్టుబడులను ఎక్కువ సాధించుకోవడం ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి. తద్వారా రాష్ట్ర జీడీపీ ప్రమాణాన్ని, రుణాలు, రెవెన్యూ లోటును స్థిరంగా ఉంచుకునేందుకు నిర్ణయించదలిచారు.
- రాష్ట్ర ఆర్థిక జీవనాడిగా ఉండే బెంగళూరులో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డిమాండ్లను పరిష్కారం చేయదలిచారు. సబర్బన్ రైలు, విభిన్నమైన రవాణా ఏకీకరణ, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వదలిచారు. ఆర్థిక ప్రగతికి మూలమైన ఉద్యోగాలను భారీగా పెంచడం ద్వారా ఆర్థిక సంవత్సరంలో ప్రగతి సాధించామని, ఆ విధానం రానున్న ఏడాది కూడా కొనసాగించదలిచారు. కొత్తగా టెక్స్‌టైల్ పాలసీ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక పాలసీలను తీసుకొచ్చారు. జీవనోపాధిలో సుస్థిరత సృష్టించేందుకు ఉద్యోగాల కోసం పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించదలిచారు.
- చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్టార్టప్‌లు, సెమి కండక్టర్‌ల ఉత్పాదన, ఐటీతోపాటు ఎంఎన్‌సీ కంపెనీలు పెట్టుబడులకు ముందుకొచ్చే వారిని ప్రోత్సహించదలిచారు. తద్వారా ఉద్యోగాలు సృష్టించడంతో పాటు ప్రాంతాలవారీగా మౌలిక సదుపాయాలు పెరగనున్నాయి.
- సంక్షేమ కార్యక్రమాలను సమాజంలోని అన్నివర్గాలకు అందించేందుకు సాంకేతికమైన విధానాలను సద్వినియోగం చేసుకోదలిచారు. సుస్థిర అభివృద్ధి, ఆర్థిక ప్రగతి పెంచుకునేందుకు రోడ్లు, కల్వర్టులు, నీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు వంటి అత్యవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగు చేయదలిచారు.
- గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు: విద్యుత్, జల సంరక్షణ, విపత్తు నిర్వహణలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోదలిచారు. సుస్థిర, వాతావరణ వైపరీత్యాలను నియంత్రించేందుకు అవసరమైన విభాగాలకు ప్రాధాన్యత ఇవ్వదలిచారు. ఆర్థిక ప్రగతితో పాటు పర్యావరణ సంరక్షణ, పరిరక్షణకు తీసుకొచ్చేందుకు గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను తీసుకురాదలిచారు.
- వ్యవసాయంలో యాంత్రీకరణ, సాంకేతిక ఆధారిత సాగు పద్ధతులు పెంచడంతోపాటు వ్యవసాయ ఆధునీకరణకు ప్రోత్సాహం ఇవ్వదలిచారు. మార్కెటింగ్ సౌలభ్యం, గిట్టుబాటు ధర పెంచడంతోపాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వదలిచారు.

అసంతృప్తిలో అధికార ఎమ్మెల్యేలు

బడ్జెట్‌కు ముందే ఎమ్మెల్యేల సభకు ఆహ్వానిస్తానని సీఎం భరోసా ఇచ్చారు. అయితే మార్చి ప్రారంభం దాకా ఎదురుచూసినా సాధ్యం కాలేదు. చివరకు శాసనసభ సమావేశాలు ఈనెల 3న గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. 4న లెజిస్లేచర్ భేటీ నిర్వహించదలిచారు. అప్పుడు తమ సమస్యలు ప్రస్తావించాలని ఎమ్మెల్యేలు భావించారు. అనూహ్యంగా వాయిదా పడింది. అంతలోనే బడ్జెట్ ప్రవేశపెట్టారు. మరోవైపు గ్యారెంటీలపై ఆర్థికశాఖ పలు సలహాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 5 గ్యారెంటీలు అమలు చేస్తున్నా అందులో నాలుగు గ్యారెంటీల ద్వారా కోట్లాదిమంది లబ్ధదారులు ఉన్నారు. వీరిలో అవసరమైన వారికి మాత్రమే గ్యారెంటీలు పొందే వెసలుబాటు కల్పించాలని ఆర్థిక నిపుణులు సూచించినట్టు తెలుస్తోంది. రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతాయనే గ్యారెంటీల జోలికి వెళ్లేందుకు సర్కారు వెనుకడుగు వేసినట్టు తెలుస్తోంది. శాసనసభ సమావేశాల వేళ ముఖ్యమంత్రికి ఎటువంటి సమస్యలు, సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయనేది వేచి చూడాలి.

వినతులు ఇచ్చానా..

శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తమ ప్రాంతాలకు ప్రాధాన్యం ఉంటుందని పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు భావించారు. దాదాపు నెలన్నరకాలంగా నియోజకవర్గాలకు అనుకూలంగా అవసరమైన పనులకోసం ముఖ్యమంత్రికి వినతులు ఇచ్చారు. బడ్జెట్‌లో ఎక్కువ మంది అధికార పార్టీ ఎమ్మెల్యేల నియోజకవర్గాలు ప్రస్తావన లేకపోవడంతో అసంతృప్తికి లోనయ్యారు. బడ్జెట్ జరిగిన వెంటనే శాసనసభ కలాపాలు సోమవారానికి వాయిదా వేయడంతో సీఎంతోపాటు ముఖ్యులంతా విధానసౌధ నుంచి వెళ్లిపోయారు. సోమవారం కలాపాలు జరుగుతుండడంతో ఎటువంటి విమర్శలు వస్తాయనేది కుతూహలం అవుతోంది.

బడ్జెట్‌పై నిలదీసేందుకు ప్రతిపక్షాలు సిద్ధం

- తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ కసరత్తు

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాలలో బడ్జెట్‌పై నిలదీసేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. బడ్జెట్‌లో కీలకరంగాలకు ప్రాధాన్యం లేకపోవడం, ప్రత్యేకించి మైనారిటీ వర్గాలకు కాంట్రాక్టు పనుల్లో రిజర్వేషన్ తీసుకురావడంపై ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశాయి. శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత కలాపాలు వాయిదాపడ్డాయి. రెండు రోజుల తర్వాత సోమవారం నుంచి కలాపాలు కొనసాగుతున్న తరుణంలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్ష నేత అశోక్ సిద్ధమయ్యారు. ఈమేరకు ఆదివారం సీనియర్ ఎమ్మెల్యేలతో అశోక్ చర్చలు జరిపారు. సోమవారం నుంచి కలాపాలలో సభ్యులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈనెల 3న శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజున గవర్నర్ ప్రసంగంతో కలాపాలు ముగిశాయి. ఆ తర్వాత మూడు రోజులు సాగాయి. ఇక శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ తర్వాత సోమవారం నుంచి పూర్తిస్థాయిలో కలాపాలు కొనసాగనున్నాయి. పైగా బడ్జెట్‌పై ప్రసంగించేందుకు సమయం కేటాయించనున్నారు. దీంతో ప్రతిపక్షాలు బడ్జెట్ పుస్తకాలపై కుస్తీ పట్టారు.

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

కదిరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. యాగశాలలో ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. పక్షం రోజులపాటు ఉత్సవాలు విజయవంతంగా పూర్తయ్యేలా చూడాలని అష్టదిక్పాలకులను వేడుకోవడం, ఉత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించే క్రతువునే అంకురార్పణ అంటారు. యాగశాలలో పుణ్యాహవచనం నిర్వహించారు. శ్రీవారి ఆలయంలో స్వామివారి సర్వ సైన్యాధ్యక్షుడైన విశ్వక్సేనుణ్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈశాన్య దిక్కునకు వెళ్లి ఉత్సవాలకు ప్రారంభ సూచికగా విష్వక్సేనుల సమక్షంలో ప్రధానాచార్యులు భూమాత అనుగ్రహం కోసం పూజలు చేశారు. మట్టిని సేకరించి, యాగశాలకు చేరుకున్నారు. ప్రధానాచార్యుడు బ్రహ్మస్థానంలో ఉండి విశేష ఆరాధనలు చేశారు. యాగశాలలో నిత్యాగ్ని హోత్రాన్ని వెలిగించారు. ఉత్సవాలు ముగిసే వరకు ఈ హోత్రం వెలుగుతూనే ఉంటుంది. కల్యాణోత్సవం తరువాత శ్రీవారు యాగశాలలో కొలువు తీరుతారు. పుట్టమన్ను సేకరించి, యాగశాలలో నవదాన్యాలను మొలక పోశారు. ఇందులో మొలక ఏ దిక్కున ఎక్కువగా వస్తుందో ఆ వైపు పంటలు బాగా పండుతాయని భక్తుల నమ్మకం. అంకురార్పణ అనగా ప్రకృతి ఆరాధన, ప్రకృతి అనగా భూదేవీ అనగా స్త్రీ, అంటే ఏ పనిని ప్రారంభించాలన్నా మొదట స్త్రీలను పూజించి, వారిని ఆ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం అనాదిగా వస్తున్న ఆచారం అని ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవం సోమవారం ఆలయ ప్రాంగణంలో కన్నులపండుగగా జరుగనుంది. అంతకు ముందు ఉదయం ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఉత్సవాలకు అధిపతి అయిన గరుడాళ్వార్‌ను ధ్వజారోహణం గావించడమే ఈ వేడుక ప్రాముఖ్యత. నేడు ఆరోహణ గావించిన గరుడాళ్వార్‌ను ఉత్సవాలు ముగిసే వరకు అలాగే ఉంచి, తీర్థవాది రోజున అవరోహణం గావిస్తారు. తొలుత యాగశాల నుంచి శ్రీవారు, అమ్మవార్లను వేర్వేరుగా పల్లకీల్లో కల్యాణ మండపానికి తీసుకొస్తారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి కల్యాణం గావిస్తారు. నారసింహుని కల్యాణంలో కూడా తలంబ్రాలు పోసుకోవడం, వేడుకకు హాజరైన వారు వధూవరులకు చదివింపులు సమర్పించడం అనాదిగా వస్తోంది. శ్రీదేవీ, భూదేవి అమ్మవార్లతో నారసింహుడి కల్యాణం తిలకించడానికి ముక్కోటి దేవతలు విచ్చేస్తారని భక్తుల నమ్మకం.

పర్యాటకుల్లో అలజడి..!

- హంపి ఘటనతో సర్వత్రా ఆందోళన
- భద్రతా లోపంపై బీజేపీ నాయకుల ఆగ్రహం

సనాపురం చెరువు


బళ్లారి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రగా పేరుగాంచిన హంపి సమీపంలో ఇద్దరు మహిళలపై జరిగిన అత్యాచారం కలకలం రేపుతోంది. హంపి కట్టడాలను సందర్శించడానికి దేశ, విదేశీ పర్యాటకులు నిత్యం వస్తుంటారు. తుంగభద్ర నదీ ప్రాంతాలు, రాతి కట్టడాలకు విశేష ప్రాముఖ్యత ఉంది. ఈ ప్రాంతంలో ఎన్నో సుందర ప్రదేశాలున్నాయి. అలాంటి వాటిలో సనాపురం చెరువు ఒకటి. ఈ చెరువుకు తుంగభద్ర నుంచి నిత్యం నీరు ప్రవహిస్తుంటాయి. చుట్టూ ఎతైన కొండలు, చుట్టూ దట్టమైన అడవులు అలాంటి ప్రదేశంలో గలగల పారే నీరు తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారు. సూర్యోదయం, సూర్యాస్తమయం సందర్శనకు పర్యాటకులు ఇష్టపడుతారు. రాత్రి పూట అయితే సంగీత ప్రియులు వాయిద్యాలతో నదీ తీరంలో కూర్చొని సేద తీరుతుంటారు. సనాపురం అంటే ఇష్టపడనివారుండరు. హంపి, అనేగొంది ప్రదేశాల్లో ఉండే స్థలాలకు ఒక్కొక్క వాటికి ఒక్కో ప్రాముఖ్యత ఉంది. హంపికి టూరిస్టులు సర్వసాధారణంగా నవంబరు నుంచి జనవరి వరకూ అధికంగా వస్తుంటారు. మార్చి నెలలో ఇక్కడి నుంచి గోవాకు తరలివెళ్తుంటారు. అయితే అత్యాచార ఘటనతో పర్యాటకుల్లో ఆందోళన నెలకొంది.

స్థానికుల్లో ఆవేదన

ఈ ప్రాంతంలో నివసించే చాలా మంది వ్యాపారులు, టూరిస్టు గైడ్లు పర్యాటకులను ఇబ్బంది పెట్టకుండా ఆకట్టుకుంటూ వారితో కలిసిమెలసి పోతుంటారు. వారు ఇచ్చే కానుకలు పొంది కాలం గడుపుతారు. కానీ అత్యాచార ఘటనతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్ల ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో తమకు చెడ్డపేరు వచ్చిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలతో పర్యాటకులు భయాందోళనకు గురవుతారని స్థానిక గైడ్లు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాంతంలో అంజనాద్రి బెట్ట, పంపాసరోవరం, తుంగభద్ర రివర్, రాఘవేంద్ర స్వామి గురువుల జీవసమాధులు, ఇలాంటి ఎన్నో ప్రసిద్ధిచెందిన స్థలాలు ఉన్నాయి. వీటిని తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు అభద్రత ఏర్పడితే అసలుకే మోసం వస్తుందని వారంటున్నారు.

పటిష్ట భద్రత కల్పించాలి: ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి



హంపీలో ఇజ్రాయిల్ మహిళ, స్థానిక హోం స్టే నిర్వహిస్తున్న మహిళల పై అత్యాచారం, అడ్డు చెప్పిన మరో టూరిస్టును చెరువులోకి తోసి మరణంకు కారణం అయిన ఘటనను గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. హంపి, ఆనేగొంది లాంటి ప్రదేశాల్లో ప్రత్యేక పోలీసుల బలగాలు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి టూరిస్టులకు భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ వైఫల్యం పై మండిపడ్డారు.

బంగారం అక్రమ రవాణా.. రంగంలోకి సీబీఐ

- రన్యారావ్‌కు బిగుస్తున్న ఉచ్చు
- నటి వెనుక పలువురు నేతలు

బెంగళూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణాపై ఉచ్చు బిగుస్తోంది. నటి రన్యారావ్ వ్యవహారం వెనుక అసలు సూత్రధారులు ఎవరనే కోణంలో దర్యాప్తుకోసం సీబీఐ రంగంలోకి దిగింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారుల సూచన మేరకు సీబీఐ అధికారులు ప్రవేశించారు. సోమవారం రన్యారావ్‌ను విచారించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రన్యారావ్ ద్వారా దుబాయ్ నుంచి భారీగా బంగారాన్ని దిగుమతి చేసుకునే వ్యూహం ఉన్నట్లు డీఆర్ఐ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈమె వెనక రాజకీయ నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. రన్యారావ్ డైరెక్టర్‌గా ఉండే శిరోడా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి 2023లో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ) నుంచి ఏకంగా 12 ఎకరాల భూమి కేటాయించారు. తుమకూరు జిల్లా శిరలో స్టీల్ కంపెనీకి భూమి మంజూరు చేశారు. 2022 ఏప్రిల్‌లో కంపెనీ రిజిస్ట్రేషన్ కాగా 2023 జనవరిలో భూమి మంజూరైంది. అంత సులువుగా 12 ఎకరాల భూమి మంజూరు చేయడం వెనుక ఉన్న రాజకీయ నాయకులు ఎవరనేది తేలాల్సి ఉంది. ఈ కంపెనీలో రిషబ్ కూడా డైరెక్టర్‌గా ఉన్నారు. రన్యారావ్ అరెస్టు తర్వాత మొఖంలో భారీగా మార్పులు రావడంతో ఆమెను సమగ్ర విచారణ జరిపినట్లు తెలుస్తోంది. రన్యారావ్ పట్టుబడిన తర్వాత ఆమె పెంపుడుతండ్రి ఐపీఎస్ అధికారి రామచంద్రరావు చేసిన వ్యాఖ్యలపైనా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రన్యారావ్ పెళ్లి తర్వాత సంబంధాలు తెగిపోయాయని చెబుతున్నా, ఇటీవలే సోదరుడి పెళ్లిలో కుటుంబ సభ్యులంతా కలసి ఉత్సాహంగా గడిపారు. ప్రముఖ నటి జయమాల కుమార్తె పెళ్లి ఫిబ్రవరిలో జరగగా రన్యారావ్ చలాకీగా పాల్గొన్నారు.

ఓవర్ టేక్ చేస్తుండగా బస్సు, కారు ఢీ...

- ఇద్దరి సజీవదహనం

చింతామణి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బస్సు, కారును ఢీ కొన్న ప్రమాదంలో మంటలు చెలరేగడంతో కారులోని ఇద్దరు సజీవదహనమయ్యారు. చింతామణి తాలూకా కెంచార్లహళ్ళి పోలీస్ స్టేషన్ పరిధిలో చింతామణి - మదనపల్లి మార్గంలోని గోపల్లి వద్ద ఆదివారం ఉదయం ప్రమాదం చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి తిరుపతికి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేసే సందర్భంలో ఢీకొంది. ఆ వేగానికి కారులోనుంచి మంటలు చెలరేగి ఇద్దరు వ్యక్తులు సజీవదహనమయ్యారు. మృతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప ప్రాంతానికి చెందిన ధనంజయరెడ్డి (50), కళావతి(42)లుగా తెలుస్తోంది. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చింతామణి ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. 29 ఏళ్ల శోభ, 60ఏళ్ల మహాలక్ష్మి, మూడేళ్ల మాన్వితాలు గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్నవారంతా ఒకే కుటుంబానికి చెందినవారని తెలుస్తోంది. కడప జిల్లాకు చెందిన ఈ కుటుంబం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న కుమారుడి చూసేందుకు కారు లో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కెంచార్ల హళ్ళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


కాలిపోతున్న కారు

అవగాహన లేకే ప్రమాదాలు..!

- ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న పర్యాటకులు
- నిఘానేత్రాలు అవసరం అంటున్న స్థానికులు..

బళ్లారి గాంధీనగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాలు... నిర్మానుష్య ప్రాంతాలపై అవగాహన లేకపోవడం...మత్తులో తాము ఎటు వెళుతున్నామో తెలియక పర్యాటకులు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని హంపి వ్యాపారులు కొందరు పేర్కొంటున్నారు. గంగావతి చుట్టుప్రక్కల ప్రక్కన ఉన్న పర్యాటక ప్రాంతాల్లో చోటుచేసుకోవడం...తీవ్ర స్థాయిలో చర్చనీయాంశమైంది. గత నెల హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యురాలు సెల్ఫీ తీసుకుంటూ తుంగభద్ర నదిలో కొట్టుకుని పోయినఘటన మరువక మునుపే... విదేశీ పర్యాటకులపై... అత్యాచార ఘటన.. పర్యాటకుల భద్రతకు ప్రశ్నార్థకంగా మారింది. కొప్పళ జిల్లాలో రమణీయమైన తుంగభద్ర పరీవాహక ప్రాంతాలు... గంగావతి తాలూకా పరిధిలోని ఆనెగొంది, సణాపుర భాగంలో సుందరమైన దృశ్యాలు వీక్షించడానికి నిత్యం దేశ, విదేశీ పర్యాటకులతో సందడి చేస్తుంటాయి. అయితే వీక్షించడానికి వచ్చిన పర్యటకులపై పరిసరాలపై అవగాహన లేకపోవడంతో... నిర్జలమైన ప్రాంతాల్లో ఒంటరిగా వెళుతున్న కారణంగా ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కొప్పళ జిల్లా పోలీసు యంత్రాంగం పర్యాటక ప్రాంతాల్లో నిఘా కెమరాలు ఏర్పాటు చేయాలని, విదేశీయులకు స్థానిక ప్రాంతాలపై అవగాహన కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



పైకప్పు కూలి ఇద్దరి దుర్మరణం

- పురాతన భవనం కావడంతోనే ప్రమాదం
- పలువురికి తీవ్ర గాయాలు

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన శిల్పకళాకేంద్రం హాసన్ జిల్లా బేలూరు పట్టణం బస్టాండ్ ముందు భాగాన పురాతనమైన షెడ్ పైకప్పు కుప్పకూలి ఇద్దరు దుర్మరణం చెందారు. ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం కేఎస్ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉండే సత్యనారాయణ అనే వ్యక్తికి చెందిన భవనం పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. భవన ప్రాంగణంలో తోపుడుబండ్లపై పండ్లు, పూలు, కూరగాయలు విక్రయించుకునేవారు. కూరగాయల వ్యాపారులు అమరనాథ్(45), నజీర్ (38), మృతి చెందారు. జ్యోతి, శిల్ప, నీలమ్మ, ఆశా, దీప తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న బేలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. స్థానికులు సైతం పెద్దసంఖ్యలో గుమిగూడి శిథిలాల కింద చిక్కుకున్నవారికోసం గాలింపు చేపట్టారు. కొన్నేళ్లక్రిందటే ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మూతపడింది. వర్షాకాలంలో కూలిపోవచ్చుననే భయంతో భవనంవైపు ఎవరూ వెళ్లేవారు కాదు. ఎండాకాలం కావడంతో ప్రమాదం ఉండదని భావించి పూలు, పండ్ల వ్యాపారం మళ్లీ నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ మహ్మద్ సుజిత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పొక్లైనర్‌తో శిథిలాల తొలగింపు కార్యాచరణ చేపట్టారు. అగ్నిమాపకసిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.


సహాయక చర్యల్లో స్థానికులు

కోటు.. హీట్!

- ఎండాకాలంలో నల్లకోటు నుంచి మినహాయింపు ఇవ్వండి
- చీఫ్ జస్టిస్‌కు న్యాయవాదుల లేఖ




బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలప్రభావం పెరిగిపోతోందని, నల్లకోటు ధరించడం ద్వారా మరింత ఇబ్బంది పడుతున్నామని, నల్లకోటు నుంచి మినహాయింపు ఇవ్వాలని బెంగళూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వివేకా సుబ్బారెడ్డితోపాటు పదాధికారులు కోరారు. ఈమేరకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అంజారియాకు లేఖ రాశారు. వేసవి సెలవులు ముగిసి కోర్టులు తిరిగి ప్రారంభమయ్యేదాకా నల్లకోటు నుంచి మినహాయింపు ఇవ్వాలని లేఖలో కోరారు. పొరుగున ఉండే మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల్లో మినహాయింపు ఇచ్చారని, రాష్ట్రంలోనూ వెసలుబాటు కల్పించాలని కోరారు. ఏసీలు లేనందున తెల్లటి దుస్తులపై నల్లకోటు వేయడం ఇబ్బందికరంగా ఉందని లేఖలో పేర్కొన్నారు. న్యాయవాదుల ఆరోగ్యదృష్ట్యా వెసలుబాటు ఇవ్వాలని కోరారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.45	5.19
సోమవారం సాయంత్రం	మంగళవారం ఉదయం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1603.54	1,585.13
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,040	2,242
నీటి నిల్వ (టీఎంసీలు)	26.45	7.41

పోలీసుల విస్తృత తనిఖీలు



పాస్‌పోర్ట్‌లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కంప్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా ఆనెగొంది ప్రాంతంలో విదేశీయులపై దాడి జరగడంతో హంపి పుణ్యక్షేత్రంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. వారు ఉంటున్న హోటళ్లు, రిసార్టులు తదితర ప్రాంతాల్లో తనిఖీ చేస్తున్నారు. ఎస్పీ హరిబాబు మాట్లాడుతూ హంపికి వచ్చిన విదేశీయులు ఆనెగొంది దానాపురం వద్ద దాడికిగురై ఒకరి హత్యకు దారితీసిన సంగతి తెలిసిందే. హంపికి వచ్చే విదేశీయుల హోటళ్లు, రూములు, వారు సంచరించే ప్రాంతాలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా వున్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించండి



పాఠశాలలో మొక్కలు నాటుతున్న టీచర్లు

కంప్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని సన్నాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత కోరారు. గ్రామంలో మహిళా దినోత్సవం, వీరభద్రస్వామి రథోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందడుగు వేయాలన్నారు. గ్రామంలో ప్రతి యేటా వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువగా జరుపుకుంటామన్నారు. ఈ పండుగ గుర్తుండిపోయేలా తాము మొక్కలను నాటామని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వరి, యశోద, సునీత, రేఖ, శశికళ పాల్గొన్నారు.

పయ్యావుల జానకమ్మ కన్నుమూత



పయ్యావుల జానకమ్మ(ఫైల్)

బళ్లారి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల యజమాని పయ్యావుల రాధాకృష్ణ మాతృమూర్తి పయ్యావుల జానకమ్మ (88) శనివారం రాత్రి కన్నుమూశారు. ఆమె వయోభారంతో కొంత కాలంగా బాధపడుతున్నారు. బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. పయ్యావుల జానకమ్మ సొంత ఊరు అనంతపురం జిల్లా బొమ్మనహాళ్. ఆదే గ్రామానికి చెందిన పయ్యావుల రామకృష్ణప్పతో వివాహం జరిగింది. ఆమె కుమారుడు పయ్యావుల రాధాకృష్ణ శ్రీ చైతన్య విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. తల్లి మరణంతో రాధాకృష్ణ శోకసంద్రంలో మునిగిపోయారు. ఆమె మరణవార్త తెలుసుకున్న ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు. బళ్లారి కమ్మసంఘం అధ్యక్షుడు ముండ్లూరు అనూప్ కుమార్, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి, తెలుగుదేశం సీనియర్ నాయకుడు చంద్రహాస్, కార్పొరేటర్లు కోనంకి తిలక్, మాత్కూర్ శ్రీనివాసులు, పాలన్న, కమ్మసంఘం నాయకులు, మేయర్ ముల్లంగి నందీష్‌బాబు, మాజీ మేయర్ రాజేశ్వరి, సుబ్బరాయుడు, మూండ్లూరు చిట్టీ, వివిధ విద్యాసంస్థల యాజమాన్యం, బోధన, బోధనేతర సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఆమె అంత్యక్రియలు బళ్లారిలోని రూపనగుడి రోడ్డు వద్దనున్న హరిశ్చంద్ర ఘాట్‌లో నిర్వహించనున్నారు.

మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

● ఐజీపీ లోకేశ్ కుమార్



మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఐజీపీ లోకేశ్ కుమార్, ఎస్పీ శోభారాణి

బళ్లారి సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని ఐజీపీ లోకేశ్ కుమార్ పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రపోలీస్ రన్-2025 కార్యక్రమాన్ని బళ్లారి జిల్లా పోలీసులు ఆదివారం నగరంలోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. 5 కి.మీ మారథాన్‌ను బళ్లారి జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ లోకేశ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన బలమైన సమాజాన్ని నిర్మించడానికి యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజలు రోడ్డు భద్రత నియమాలను పాటించాని, డ్రైవింగ్ చేసేటప్పుడు మీ భద్రత కోసం హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. సైబర్ మోసగాళ్ల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలన్నారు. జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ శోభారాణి ప్రారంభోపన్యాసం చేస్తూ మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిచేందుకు ప్రజలకు అవగాహన కల్పిచేందుకు 5కి.మీ రన్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బళ్లారి డివిజన్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సందీప్ సూర్యవంశీ, అదనపు పోలీసు సూపరింటెండెంట్ రవి కుమార్, నవీన్‌కుమార్, ఇర్షాద్ ఆలం, జిల్లాపోలీస్ శాఖ అధికారులు, రిటైర్డ్ సైనికులు, అథ్లెట్లు, వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రజలు, పాల్గొన్నారు.

మారథాన్‌లో మహిళల విభాగంలో మొదటి బహుమతి శిరీష(బళ్లారి), రెండవ బహుమతి విజయలక్ష్మి(దార్వాడ్), తృతీయ బహుమతి జాహిదా(బళ్లారి) సాధించారు. పురుషుల విభాగంలో మొదటి బహుమతి శివానంద(బెల్గాం), రెండో బహుమతి రాజేశ్ కుమార్(బెంగళూరు), మూడో బహుమతి మణికంఠ(దార్వాడ్) సాధించారు. 5కే రన్ దురుగమ్మ ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమై గడిగి చెన్నప్ప సర్కిల్, పాత డీసీ కార్యాలయం, గవియప్ప సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, వాల్మీకి సర్కిల్, తాలూరు రోడ్డు క్రాస్ మీదుగా తిరిగి ఆలయ ప్రాంగణానికి చేరుకుంది.

విదేశీయుల సందడి

బళ్లారి సిటీ: హొసపేట నగరంలో 'మన పోలీసులు మన గర్వం' అనే నినాదంతో ఆదివారం మారథాన్ రన్ నిర్వహించారు. విదేశీయులు సహా వేలాది మంది ప్రజలు పాల్గొని సందడి చేశారు. తుంగభద్ర ఆనకట్ట మోడల్ రూమ్ వద్ద నుంచి 5కే మారథాన్ రన్ ప్రారంభమై సాయి బాబా సర్కిల్ వద్ద ముగిసింది. ఎమ్మెల్యే హెచ్‌ఆర్.గవియప్ప మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. హంపిని సందర్శించిన స్వీడన్‌కు చెందిన ఫ్రీడా మహిళల విభాగంలో మొదటి స్థానం గెలుచుకుని ప్రశంసలు అందుకుంది. డి.సువర్ణ రెండో స్థానంలో, ఉషా రోహిణి మూడవస్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో వినయ్ మొదటిస్థానంలో కె.మంజునాథ్ రెండవ స్థానంలో స్వీడన్‌కు చెందిన జోహాన్ నిలిచారు. ఆఫీసు విభాగంలో వికాస్ లమానీ మొదటి స్థానం సాధించారు. సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రత్తంగా ఉండాలని ఎస్పీ శ్రీహరిబాబు సూచించారు.



హొస్పేట: మారథాన్‌లో పాల్గొన్న పోలీసులు, విదేశీయులు

లోక్ అదాలత్‌లో 11,643 కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి శాంతి

బళ్లారి గాంధీనగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బళ్లారి, విజయనగర ఉభయ జిల్లాలో మొత్తం 31 కోర్టుల్లో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో మత్తం 11,643 కేసులు పరిష్కరించగా, అందుకు సంబంధించి రూ.1,03,97,30 పరిహారం వసూలు చేసినట్లు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి, చట్టసేవ ప్రాధికార అధ్యక్షురాలు శాంతి తెలిపారు. బళ్లారి నగరంలోని జిల్లా కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ కుదుర్చినట్లు వివరించారు. సర్వజనికులు, కక్షిదారులు తమ వ్యాజ్యాలకు సంబంధించి పరస్పరం రాజీ ద్వారా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవడానికి సదావకాశం అన్నారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా చట్టసేవ ప్రాధికార సెక్రటరీ రాజేష్ ఎన్.హొసమనెలతో పాటు వివిధ కోర్టుల న్యాయాధికారులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన మూఢనమ్మకం

చిన్నారి మృతి.. తల్లిపై కేసు నమోదు

బళ్లారి గాంధీనగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వైద్య విజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా.. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ మూఢనమ్మకాలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. చిన్నారికి జ్వరం వస్తే గాజుముక్కను వేడిచేసి తల పునెక, మెడ భాగంలో చిటికెలు వేస్తే పోతుందన్న మూఢ నమ్మకాలు ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. అలాంటిదే ఓ తల్లి బిడ్డ ఆరోగ్యం బాగోలేదని అగరబత్తితో కాలిస్తే వ్యాధి నయమవుతుందనే మూఢ నమ్మకంతో ఆఖరికి బిడ్డనే కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గత ఏడాది నవంబరులో కనకగిరి తాలూకా పరిధిలో ఒక గ్రామంలో ఏడు నెలల చిన్నారి అనారోగ్యం బారిన పడింది. ఆస్పత్రిలో చికిత్స చేయించినా నయం కాలేదు. ఎవరో చెప్పిన మాటలు విన్న తల్లి అగరబత్తీతో శరీరంపై కాల్చితే వ్యాధి నయమవుతుందని నమ్మి చిన్నారిపై వాతలు పెట్టింది. అవి కాస్త సెప్టిక్ కావడంతో శిశువు మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ టి.లింగరాజు పిల్లల రక్షణా విభాగానికి సమాచారం అందించారు. దీంతో అధికారులు శిశుమరణానికి దారితీసిన కారణాలు తెలుసుకునే ప్రయత్నంలో ఈ ఘటన వెలుగు చూసింది. ముక్కుపచ్చలారని పసికూనకు అగరబత్తీతో శరీరంపై కాల్చడం, ఆదికాస్త సెప్టిక్ కావడంతో మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. బిడ్డకు శవ పరీక్షలు చేసిన సందర్భంలో శరీరంపై కాలిన గాయాలు ఉన్నట్లు, అది సెప్టిక్ అయినట్లు డాక్టర్లు గుర్తించారు. పిల్లల రక్షణా విభాగం అధికారి ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తల్లిపై కేసు నమోదు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● జిల్లా న్యాయాధికారి కేజే శాంతి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి శాంతి, జైలు సూపరింటెండెంట్ లత

బళ్లారిరూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినపుడే దేశం పురోగాభివృద్ధి సాధిస్తుందని జిల్లా న్యాయాధికారి కేజే శాంతి అన్నారు. నగరంలోని మోకా రోడ్డు నక్షత్ర హోటల్‌లో ఆదివారం శ్రీమాతృ మండలి సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయాధికారి శాంతి, జైలు సూపరింటెండెంట్ లత, న్యాయాధికారి రాజేష్ వసమని ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ.. మహిళలు ఇంటికే పరిమితం కాకూడదని, ఉన్నత చదువులు చదివి అత్యున్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. స్త్రీలేనిదే ప్రపంచం లేదని, స్త్రీ ఇంటికిబాధ్యతగా సంసారాన్ని ముందుకు నడిపిస్తుందని అన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హనుమంతు, సినీ నటి అంకిత, జయరాం, మాతృమండలి సంస్థాపక అధ్యక్షురాలు పుష్ప చంద్రశేఖర్, ప్రకృతి రెడ్డి, సుజాతమ్మ, చంద్రికి మమత, జ్యోతి సునీత, కళావతి, కవిత, పార్వతి, సీమ, హేమ, ధనలక్ష్మీకళతో పాటు పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

గంగావతి రూరల్: భారత్ స్కౌట్స్, కర్ణాటక స్థానిక సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గంగావతిలో ఘనంగా నిర్వహించారు. జిల్లా శిక్షణ కమిషనర్ సరోజ అమరావతి మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దేశ విదేశాల్లో మహిళలకు చాలా ఉన్నత హోదా, గౌరవం ఉందని సమాజంలో పురుషుల కంటే తాము తక్కువ కాదన్నట్లుగా మహిళలు ప్రతి రంగంలోనూ రాణిస్తున్నారన్నారు. నేడు పాఠశాల, కళాశాల విద్యార్థులు, భారత్ స్కౌట్ గైడ్స్ శిక్షణ పొందుతున్న వారు సమాజాన్ని తమదైన సహకారాన్ని అందించడం ద్వారా ఆదర్శంగా ఎదుగుతున్నారన్నారు. గతంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహిళలు చాలామంది ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మహమ్మద్, జిల్లా గైడ్ కమిషనర్లు అరుణ వస్త్రాద్, ఫరీదా అక్తర్, సుమ, సరోజ అమరావతి తదితరులు పాల్గొన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సరోజ

ధార్మిక కార్యక్రమాలతోనే గ్రామాల్లో ప్రశాంతత



మాట్లాడుతున్న శివప్రసాద్ స్వామి

కంప్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలతోనే గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించవచ్చునని హెబ్బాల్ మఠం మఠాధీశులు శివప్రసాద్ స్వామి అన్నారు. ఆదివారం కంప్లి తాలుకా సన్నాపురం గ్రామంలో శరణు బసవేశ్వర పురాణ పఠనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక గ్రామంలో దేశభక్తి ఎలా వుంటుందో అలాగే దైవభక్తి ఉన్నప్పుడే ప్రశాంత జీవనం సాగించవచ్చన్నారు. బుక్కసాగర కరిసిద్దేశ్వరమఠం మఠాధీశులు విశ్వారాధ్య శివాచార్యులు మాట్లాడుతూ శరణు బసవేశ్వర పురాణపఠనం చదవడం వల్ల మనశ్శాంతి కలుగుతుందన్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్యం పెంపొందించుకోచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు ఈసప్ప, చెన్నప్ప, రేణుకగౌడ, శాంత, శరణప్ప, కుమారస్వామి, దొడ్డ బసప్ప, మల్లయ్య, తహసీల్దార్ శివరాజ్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస రావు, వెంకటరామరాజు, గంగాధర, వాలి కొట్రప్ప, శరణప్ప, విద్యాధర్ పాల్గొన్నారు.

ప్రజలకు న్యాయం చేసినప్పుడే సంఘాలకు గుర్తింపు



ఎన్నికైన పదాధికారులు

కంప్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అవినీతిని ఎదుర్కొని ప్రజలకు న్యాయం చేకూర్చినప్పుడే సంఘాలకు గుర్తింపు వస్తుందని భీమ్ ఆర్మీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజగోపాల్ అన్నారు. పట్టణంలో సంగాత్రేయ పాఠశాలలో భీమ్ ఆర్మీ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘంలో ఐక్యతతో వుండి ప్రతి అన్యాయాన్ని ఎదుర్కొంటూ ముందుకు సాగుతూ తమదైన శైలిలో గుర్తింపు పొందాలని సూచించారు. గ్యారెంటీ పథకాల పేరుతో అభివృద్ధి శూన్యమన్నారు. రానున్న ఎన్నికల్లో భీమ్ ఆర్మీ నుంచి కూడా అభ్యర్థులు పోటీలో నిలబడి ప్రజలకు అండగా ఉంటారన్నారు. తాలుకా అధ్యక్షుడు యల్లప్ప మాట్లాడుతూ తమపై నమ్మకం వుంచే రాష్ట్ర అధ్యక్షులు తాలుకా అధ్యక్షులుగా నియమించారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని సిద్ధాంతాలను అలవరుచుకుంటామని తెలిపారు. అంతకు ముందు అంబేడ్కర్ సర్కిల్ నుంచి సంగాత్రేయ పాఠశాల వరకు భీమ్ ఆర్మీ పదాధికారులు ఊరేగింపు చేపట్టారు. అనంతరం పదాధికారుల ని యామకం జరిగింది. అధ్యక్షులుగా యల్లప్ప, గౌరవాధ్యక్షులుగా జిలాన్, ఉ పాధ్యక్షులుగా ధనరాజ్, ప్రధాన కార్యదర్శిగా వీరేష్, దానప్ప, రఘువీరా, స తీష్, రాము ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, సి రుగుప్ప అధ్యక్షుడు ధర్మరాజు, కురుగోడు అధ్యక్షుడు శేఖర్, బళ్లారి గ్రామీణ ప్రాంత అధ్యక్షుడు మల్లికార్జున, అక్కి జిలాన్, రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

పిల్లలకు నీతి నేర్పాలి

● విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ప్రాణేశ్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ప్రాణేశ్

గంగావతి రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లలకు ఇంట్లో నీతిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు ప్రాణేశ్ అన్నారు. కొప్పళలోని మోడల్ హై ప్రైమరీ స్కూల్(ఎంహెచ్‌పీఎస్)లో 1990-91లో 7వ తరగతి విద్యార్థులు నిర్వహించిన గురువందన, అపూర్వకలయిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పాఠశాలల్లో నీతి తరగతులు లేవని, పిల్లలు సరైన మార్గంలో నడిచేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు అక్కమదేవి, అస్మత్ బేగం, నాగమ్మ మాట్లాడారు. వేదికపై అజ్జప్ప ఎలుబావి, విరూపాక్షప్పమేటి పాల్గొన్నారు. కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అందప్ప బోలారెడ్డి అధ్యక్షత వహించి పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉన్న పదవుల్లో పనిచేస్తున్నారని, పాఠశాల సమగ్రాభివృద్ధికి పూర్వ విద్యార్థులతో చేతులు కలపాలని పిలుపునిచ్చారు. పూర్ణిమతుప్పాడ, దేవమ్మ బరాకేర, వెంకటేశ్ కవలూర్, శ్రీదేవి, అనంత జాగీర్దార్, లక్ష్మీకాంత్, ప్రతిమ, పట్టణశెట్టి, ప్రశాంత, సునీత, మైత్రి, వేణుగోపాల్, రాజేశ్వరీ, కత్తిమణి పాల్గొన్నారు.

అనారోగ్యంతో గ్రామ పంచాయతీ సభ్యుడి మృతి



అంజి (ఫైల్)

బళ్లారిరూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బళ్లారిరూరల్ పరిధిలోని అమలాపురం గ్రామ పంచాయతీ సభ్యులు గోడేహాళ్ (అంజి) ఆంజనేయులు అనారోగ్యంతో శనివారం బళ్లారిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి గ్రామ పంచాయతీ పీడీవోలు గ్రామ పంచాయతీ సర్వసభ్యులు పలు గ్రామ పంచాయతీ సభ్యులు ఆయన ఆత్మశాంతి చేకూరాలని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

బ్యాంకు సదుపాయాలను వినియోగించుకోండి



బ్యాంకును ప్రారంభించిన గిరియప్ప, హోసకేరి

కంప్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వ్యాపారులు, రైతులు, ప్రజలు బ్యాంకులు ఇచ్చే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని చెన్న బసవస్వామి సహకార బ్యాంకు అధ్యక్షులు గిరియప్ప, హోసకేరి కోరారు. కంప్లి పట్టణం కొట్టాల రోడ్డులో నూతనంగా కల్లుడి కాంప్లెక్స్‌లో చెన్నబసవస్వామి సహకార బ్యాంకును ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే పలు చోట్ల ఈ శాఖలు ప్రారంభమయ్యాయని, కంప్లిలో నూతన శాఖ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ శివరామ్ గౌడ, మాజీ ఎమ్మెల్యే పరన్న మనువళ్లి, హాలప్ప, రాజప్ప, కార్యదర్శి నాగేష్, మేనేజర్ శ్యామసుందర్, పట్టణ ప్రముఖులు హేమయ్యస్వామి, శ్రీధర్‌శెట్టి, రవీంద్రప్రసాద్, కల్లుడి విశ్వనాథ్ పాల్గొన్నారు.

హోసూరు జోన్

అపూర్వ కలయిక

హోసూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శూలగిరి సర్కిల్ ఇమ్మిడినాయకనపల్లి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం భేటీ అయ్యారు. 2004-05లో పదో తరగతికి చెందిన విద్యార్థులు 20 సంవత్సరాల తర్వాత కలిశారు. తమ పాత రోజులను జ్ఞాపకం చేసుకుని సరదాగా గడిపారు. తొలుత వారు తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందచేసి ఆత్మీయంగా సత్కరించారు. విద్యార్థి దశలో తమ పురోగతికి బాటలు వేసిన గురువులను సన్మానించారు. పలువురు వివిశాఖలలో ఉన్నత హోదాలలో అధికారులుగా ఉండగా ప్రైవేట్ సంస్థలలోనూ కీలకంగా ఉన్నట్టు పూర్వ విద్యార్థులు తెలిపారు. 2004-05 లో చదివిన విద్యార్థులందరూ ఐఎన్ స్కూల్ పేరుతో వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడినట్టు తెలిపారు. తాము చదివిన పాఠశాలకు ఏదైనా చేయూతనివ్వాలని, తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు ప్రియ, మలర్‌విళి, జయప్రకాశ్, ఇళంతో, కుప్పుస్వామి, తీర్థగిరి పాల్గొన్నారు.



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

విద్యార్థులకు భోజన సామగ్రి అందజేత



భోజన సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే

హోసూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ 72వ పుట్టినరోజు సందర్భంగా హోసూరు మున్సిపల్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ యూత్ ఆర్గనైజర్ కలైసెళియన్ ఆధ్వర్యంలో బాగలూరు రోడ్డులోని వినాయక ఆశ్రమంలో చిన్నారులకు పాఠశాల సామగ్రి భోజనం అందచేశారు. డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే ప్రకాశ్, పార్టీ మున్సిపల్ కార్యదర్శి మేయర్ సత్య పాల్గొని విద్యార్థులకు మిఠాయిలు అందచేశారు. అనంతరం పిల్లలకు బ్యాగులు, క్యారియర్ బాక్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, జిల్లా యూత్ ఆర్గనైజర్ సుమన్, మున్సిపల్ యూత్ శ్రీనివాసన్, పలువురు డీఎంకే సభ్యులు పాల్గొన్నారు.

బహుళ ప్రయోజన కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ సత్య

హోసూరు మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుడి అభివృద్ధి నిధి కింద రూ.8లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజన కేంద్రాన్ని ఎమ్మెల్యే వై ప్రకాశ్ ప్రారంభించారు. మేయర్ సత్య తదితరులు పాల్గొన్నారు. హోసూరు శాసనసభ నియోజక వర్గం హోసూరు పంచాయతీ యూనియన్ తొరపల్లి పంచాయతీ కుముదేపల్లి గ్రామంలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పుట్టినరోజును సందర్భంగా ప్రజలకు బియ్యం, పంచదార పంపిణీ చేసి కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. పంచాయతీ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు రాము నేసపాటిల్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, యూనియన్ కమిటీ మాజీ సభ్యుడు త్యాగరాజు, జిల్లా వ్యవసాయ బృందం సబ్ ఆర్గనైజర్ రామమూర్తి, సంతోష్, రాము, పంచాయతీ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు రవి, డీఎంకే అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధ్వజారోహణతో రథోత్సవానికి శ్రీకారం

హోసూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖమైన చంద్రచూడేశ్వర ఆలయం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణకు శ్రీకారం చుట్టారు. ఆదివారం ధ్వజస్తంభానికి విశేషపూజలు నిర్వహించారు. ఈనెల 14న శుక్రవారం రథోత్సవం జరగనుంది. ప్రధాన అర్చకుడు వాచేశ్వరన్ నేతృత్వంలో వినాయకుడు, చంద్రచూడేశ్వర, మరగతాంబ అమ్మవారికి పూజలు నిర్వహించారు. విశేషపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ప్రొఫెసర్ యూఆర్ రావు (జయంతి)



అంతరిక్ష శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ గ్రహీత ప్రొఫెసర్ యూఆర్ రావు 1932 మార్చి 10న కర్ణాటక రాష్ట్రం ఉడుపిలో జన్మించారు. పూర్తి పేరు ఉడుపి రామచంద్రరావు. డాక్టర్ విక్రమ్ సారాభాయ్ నేతృత్వంలో పీహెచ్‌డీ చేశారు. 1985లో ఇస్రో సంస్థకు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక రాకెట్ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిని వేగవంతం చేశారు. ఇన్‌సాట్ ఉపగ్రహాల విజయవంతంతో దేశంలోని మారుమూల ప్రాంతాలకు టెలీ కమ్యూనికేషన్ సౌకర్యం, ఎస్‌టీడీ అందుబాటులోకి వచ్చింది. రిమోట్ సెన్సింగ్, వాతావరణ సేవలు విస్తృతమయ్యాయి. ఆంట్రిక్స్ కార్పొరేషన్ మొదటి చైర్మన్‌గా వ్యవహరించారు. కర్ణాటక రాజ్యోత్సవ, ఆర్యభట్ట అవార్డు, జవహర్‌లాల్ నెహ్రూ అవార్డు, యూరీ గగారిన్ మెడల్ తదితర గౌరవాలు పొందారు. 2017 జూలై 24న కన్నుమూశారు.

డాక్టర్ పి. కేశవరెడ్డి (జయంతి)



వృత్తిరీత్యా వైద్యుడైనా ప్రముఖ నవలా రచయితగా పేరొందిన డాక్టర్ పెనుమూరు కేశవరెడ్డి 1946 మార్చి 10న చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం తలుపుల పల్లెలో జన్మించారు. ఆయన రాసిన ఎనిమిది నవలలు పాఠకుల ఆదరణ పొందాయి. కొన్ని హిందీలోకి తర్జుమా కాగా ఆంగ్లంలో మాక్‌మిలన్, ఆక్స్‌ఫర్డ్ వంటి సంస్థలు ప్రచురించాయి. అణగారిన వర్గాల ప్రజల కష్టజీవులకు కావ్యగౌరవం కలిగించి వారి జీవిత కదనాన్ని కథనంగా మలిచి పాఠకుడి ముందు నిలిపిన రచయిత కేశవరెడ్డి. పాండిచ్చేరిలో ఎంబీబీఎస్ చేశాక నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి విక్టోరియా మెమోరియల్ ఆసుపత్రిలో స్కిన్ స్పెషలిస్టుగా కుష్టురోగులకు సేవలందించారు. కుష్టు వ్యాధిపై ఆయన రాసిన పరిశోధనా పత్రాలు పలు జాతీయ, అంతర్జాతీయ మెడికల్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 2015 ఫిబ్రవరి 13న మరణించారు.

తరుణ్‌చుగ్‌కు ఆత్మీయ స్వాగతం



తరుణ్‌చుగ్‌ను స్వాగతిస్తున్న నాయకులు

దేవనహళ్ళి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ బెంగళూరుకు ఆదివారం విచ్చేశారు. దేవనహళ్ళిలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు పార్టీ నాయకులు ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రాజీవ్, రాష్ట్ర కార్యదర్శి తమ్మేశ్ గౌడ తదితరులు ఉన్నారు.

61 ఏళ్ల వ్యక్తికి ఒకే విడతలో వెన్ను చికిత్స

బెంగళూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్ల కాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్న 61ఏళ్ల వృద్ధుడికి ఒకేసారి శస్త్రచికిత్స ద్వారా సంపూర్ణ ఆరోగ్యం తుడిగా తీర్చినట్టు అపోలో స్పెక్ట్రా వైద్యులు ప్రకటించారు. 2019 ఆగస్టులో సంజయ్‌సింగ్ అనే వ్యక్తి వెన్నులో ఇంటర్ ట్రాజాంటెరిక్ ఫ్రాక్చర్‌కు గురయ్యారు. పలు చోట్ల వెన్నుపూసల అమరిక కోసం ఆపరేషన్‌లు చేయించుకున్నారు. అయితే సమస్య పూర్తిగా నయం కాకపోవడంతో అపోలో స్పెక్ట్రా ఆసుపత్రిలో చేరినట్టు డాక్టర్ పవన్‌చెబ్బి తెలిపారు. సమగ్ర పరీక్షలు జరిపి ఒకే ఆపరేషన్‌తో సమస్యను పరిష్కరించారు. వెన్నుపూసకు ఆపరేషన్ చేయడం సాధారణ ప్రక్రియ అని అయితే సంజయ్‌సింగ్ సుదీర్ఘకాలంగా ఇబ్బందిపడడం, అప్పటికే కొంత సమస్య ఏర్పడిందన్నారు. ప్రస్తుతం సంజయ్‌సింగ్ పూర్తిగా కోలుకున్నారని తెలిపారు.

రమ్యానంద భారతి ఆధ్యాత్మిక ప్రసంగం



ఆశీర్వదిస్తున్న మాతాజీ రమ్యానందభారతి

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శక్తిపీఠం మాతాజీ రమ్యానంద భారతి ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. హొస్కోటె రోడ్డులోని చైతన్య సమర్పణలో ఆధ్యాత్మిక ప్రసంగానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటైన కార్యక్రమంలో మాతాజీ రెండు రోజులపాటు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

రాయచూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవీనగర్‌లో నివాసముంటున్న ప్రసన్నలక్ష్మి(35) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆదివారం ఉదయం ఆమె ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 16 ఏళ్ల క్రితం జంబనగౌడ అనే వ్యక్తితో వివాహమైందిన కొంతకాలంగా భార్య,భర్తల మధ్య గొడవలు జరుగుతుండేవని స్థానికులు తెలిపారు. భర్త విడాకులు కోరుతున్నట్లు వారు తెలిపారు. రెండు రోజుల క్రితం భర్తపై ప్రసన్నలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. భర్తనే హత్యచేసి ఆమెకు ఉరివేసి ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు. ఎవరూ ఇంట్లో లేని సమయంలో ఘటన జరిగి ఉంటుందని పోలీసులకు అనుమానం వ్యక్తం చేయడంతో మహిళా పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కృత్రిమ మేధస్సుదే నిర్ణయాత్మక పాత్ర

» స్నాతకోత్సవంలో ప్రొఫెసర్ జీటీ సీతారాం

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆధునికయుగంలో కృత్రిమ మేధస్సు నిర్ణయాత్మకపాత్రగా ఉందని ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ జీటీ సీతారాం అభిప్రాయపడ్డారు. బసవనగుడి నేషనల్ కళాశాల స్నాతకోత్సవం ఆదివారం జరిగింది. 577మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, 9మందికి బంగారు, వెండి పతకాలు అందచేశారు. విద్యార్థులనుద్దేశించి జీటీ సీతారాం మాట్లాడుతూ ఈ ఏడాది సాంకేతిక రంగంలో అనూహ్యమైన మార్పులు రానున్నాయని విద్యార్థులు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ నుంచి నైపుణ్యత పెంచుకోవాలన్నారు. ఏఐ యుగంలో నైతిక విలువలు కీలకమన్నారు. 1980 దశకంలో కంప్యూటర్ వచ్చినప్పుడు బ్యాంకు ఉద్యోగులు వేటుపడతాయని పోరాటం చేశారన్నారు. అయితే ఏఐ టెక్నాలజీతో కొంతమేర ఉద్యోగులకు నష్టం కలగవచ్చునన్నారు. డీప్ ఫేక్‌పైనా ఆందోళనలు ఉన్నాయన్నారు. చాట్ జీపీటీ టెక్నాలజీతో 20 సెకన్లలో కన్నడ కవితలను సైతం రూపొందించే సౌకర్యం వచ్చిందన్నారు. ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్, నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ కార్యదర్శి వెంకటశివారెడ్డి, గౌరవ అధ్యక్షులు హెచ్‌ఎన్ సుబ్రమణ్య, ఉపాధ్యక్షులు జీవై మధుసూధన్, గౌరవ కార్యదర్శి అరుణ్‌కుమార్, కోశాధికారి తల్లం ఆర్ ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పట్టాలతో విద్యార్థులు, వేదికపై ప్రముఖులు

లోక్ అదాలత్‌లో 406 కేసుల పరిష్కారం

శిడ్లఘట్ట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టులో శనివారం ఏర్పాటైన జాతీయ లోక్‌అదాలత్‌లో 406 కేసులు రాజీ అయ్యాయి. సీనియర్ సివిల్ న్యాయాధికారి మొహమ్మద్ రోషన్‌షా అదాలత్‌ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కక్షిదారులు, ప్రజలు స్వచ్ఛందంగా కేసులను రాజీ చేసుకోవడం ద్వారా పరస్పరం ఉత్తమ బాంధవ్యాలు సాధ్యమన్నారు. ఎక్కువగా ఆస్తి కేసులు రాజీకి వచ్చాయన్నారు. 406 కేసుల రాజీ కాగా 92మందికి జనన ధ్రువీకరణపత్రాలు పంపిణీ చేశారు. న్యాయాధికారి జె పూజా పలు కేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. రాజీకర్తగా న్యాయవాదులు ఎస్‌కే నాగరాజ్, టీకే వెంకటేశ్ వ్యవహరించారు. తాలూకా న్యాయవాదులసంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి, కార్యదర్శి సీజీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్‌ను ప్రారంభిస్తున్న న్యాయాధికారి మొహమ్మద్ రోషన్‌షా

మహిళల్లో నైపుణ్యం పెంచడమే ఆశయం



నటి సోనాలీ బింద్రె, అమెజాన్ సంస్థ దీప్తివర్మ తదితరులు

బెంగళూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మహిళల్లో నైపుణ్యత పెంచడమే ఆశయంగా పెట్టుకున్నట్టు అమెజాన్ ఇండియా వైస్‌ప్రెసిడెంట్ దీప్తివర్మ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో ఆదివారం సమాజంలో భిన్నమైన రంగాలలో రాణిస్తున్న వందమంది మహిళలకు స్పీడ్ మెంటర్ నిర్వహించారు. అమెజాన్ ఎలివేట్ హర్ పేరిట నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో దీప్తివర్మ మాట్లాడుతూ తమ సంస్థ మహిళల ప్రగతికి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. సదృఢమైన స్వావలంబనకు కట్టుబడ్డామన్నారు. ప్రముఖ నటి సోనాలిబెంద్రెలు పాల్గొన్నారు. పనిచేసే చోట మహిళలు విశ్వాసంతో నిర్భయంగా ఉండేలాంటి వాతావరణం ముఖ్యమన్నారు. అమెజాన్ ఇండియా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ గీతాంజలి భూతాని, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ జువాకాన్, టాలెంట్ యాక్విసేషన్ డైరెక్టర్ రాజీవ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరిద్దాం - నేరాలు నియంత్రిద్దాం : హోం మంత్రి

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి భద్రతలు సజావుగా సాగాలంటే పోలీసులతో సహకరించాల్సిన అవసరం ఉందని, తద్వారా నేరాల నియంత్రణ జరగనుందని హోం మంత్రి పరమేశ్వర్ పిలుపునిచ్చారు. కర్ణాటక పోలీస్ రన్ 2025 పేరిట మారథాన్‌ను ఆదివారం విధానసౌధ ఎదుట లాంఛనంగా ప్రారంభించారు. వేలాది మంది నగర ప్రజలు, పోలీసులు, ఎస్‌బీఐ ఉద్యోగులు మారథాన్‌లో పాల్గొన్నారు. విభాగాల వారీగా మారథాన్ విజేతలకు సత్కరించారు. సీఎం రాజకీయ కార్యదర్శి గోవిందరాజు, డీజీపీ అలోక్ మోహన్, నగర పోలీస్ కమిషనర్ దయానంద్, సీఐడీ డీజీపీ ఎంఏ సలీం, ఏడీజీపీలు హితేంద్ర, ఉమేశ్, ఎస్‌బీఐ చీఫ్ జుహీస్మితా, సిన్హా, వీఎస్ శర్మ, సుశీల్ కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



విధానసౌధ వద్ద ఉత్సాహంగా మారథాన్‌లో ఇలా..

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక

బంగారపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని తుమటెగెరె గ్రామానికి చెందిన బీజేపీ, జేడీఎస్‌లకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎస్‌ఎన్ యువసేన నాయకుడు నవీన్‌గౌడ నేతృత్వంలో ఎమ్మెల్యే నారాయణస్వామి నేతృత్వంలో కాంగ్రెస్‌లోకి చేరారు. పార్టీ జెండాతో ఆత్మీయంగా స్వాగతించారు. గ్రామాలలో ఎమ్మెల్యే కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను, సేవలను గుర్తించి కాంగ్రెస్‌లో చేరినట్టు వారు తెలిపారు. పాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు దేవేగౌడ, రామచంద్రప్ప, గోవిందప్ప, వెంకటేశప్ప, మునిరాజు, జగదీశ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.



పార్టీ జెండాలతో కార్యకర్తలు

ఉత్సాహంగా మహిళా దినోత్సవం

బాగేపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆవెస్పైర్ ఫౌండేషన్, స్కేలార్ కంపెనీలు సంయుక్తంగా పలు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. బీఈఓ వెంకటేశప్ప మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతంమైన తాలూకాలో మౌలిక సదుపాయాలు కొరత నడుమ పిల్లల విద్య సాగుతోందన్నారు. స్కేలార్, ఆవెస్పైర్ ఫౌండేషన్ వంటి సంస్థలు సీఎస్‌ఆర్ ద్వారా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఇదే సందర్భంగా వివిధ రంగాల సాధకులను సత్కరించారు. పీఎంశ్రీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు హనుమంతరెడ్డి, తాలూకా విద్యా సమన్వయ అధికారి ఆర్ వెంకటరామ్, డాక్టర్ అర్చనా తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖులకు సత్కారం

సర్జాపురలో సంబరంగా...

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకా సర్జాపుర పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో మహిళల సోల్ స్పిరిట్ బృందం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉత్సాహంగా సాగింది. అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం వవిధ రంగాల సాధకులకు మహిళారత్న అవార్డులతో సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాటం, భరతనాట్య ప్రదర్శన సభికులను అలరించింది. సర్జాపుర గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మమతా రమేశ్, మహిళా ప్రముఖులు మమతా ఎస్‌వై శంభయ్య, శైలా శ్రీనివాస్, డాక్టర్ రూప, యోగాగురు స్వాతి శక్తిరూప, రిటైర్డు టీచర్ మునిరత్నమ్మ, సభియా, పూజాచంద్ర, సర్జాపుర అభివృద్ధి సంజీవిని సమాఖ్య పదాధికారులు, మృత్యుంజయ ఫౌండేషన్, నవ ఎక్స్‌ప్రెషన్ సంస్థ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వివిధ సంఘాల మహిళలు

15న దేవిశ్రీ ప్రసాద్ లైవ్ ఈవెంట్

బెంగళూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ డిఎస్‌పి లైవ్ ఇండియాటూర్‌లో భాగంగా ఈనెల 15న బెంగళూరులో ప్రదర్శన ఇవ్వనున్నారు. డ్రోన్ షోలు, అంతర్జాతీయ డ్యాన్సర్స్ బుడాపెస్ట్ స్కోరింగ్ ఆర్కెస్ట్రా వంటి ప్రదర్శనలు కొనసాగనున్నాయి. నెలమంగలరోడ్డు మాదవర నైస్ గ్రౌండ్స్‌లో ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. దేశవ్యాప్తంగా దేవిశ్రీప్రసాద్ సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే బెంగళూరులో ఈవెంట్ ఉంటుందన్నారు. సంగీతాభిలాషులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తుంగభద్రలో ముగ్గురు యువకుల గల్లంతు

● మదలగట్టి సమీపంలో పుట్టినరోజు వేడుకల్లో ప్రమాదం



గాలింపు చర్యల్లో పోలీసులు

బళ్లారి సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హూవినహడగలి తాలూకాలోని మదలగట్టి సమీపంలోని తుంగభద్ర నదిలో గదగ్ జిల్లా శిరహట్టికి చెందిన ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం సాయంత్రం శరణప్ప అనే యువకుడి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడానికి ఐదుగురు స్నేహితులు కారులో శిరహట్టి నుండి మదల గట్టికి వచ్చారు. వారిలో ముగ్గురు స్నానం చేయడానికి నదిలోకి దిగారు. గుంతలో మునిగిపోతున్న శరణప్ప సహాయం కోసం అరిచాడు. అతన్ని కాపాడడానికి మరో ఇద్దరు ప్రయత్నించారు. అయితే ఇద్దరు స్నేహితులు రక్షించడానికి వెళ్ళి వారు కూడా నదిలో కొట్టుకుని పోయారని పోలీసులు తెలిపారు. ఆదివారం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆచూకీ తెలియరాలేదు. ప్రస్తుతానికి గాలింపు చర్యలు నిలిపివేసి సోమవారం తిరిగి ప్రారంభిస్తామని పోలీసులు తెలిపారు. తహశీల్దార్ సంతోష్‌కుమార్, పీఎస్‌ఐ విజయకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సహాయక చర్యలు చేపట్టారు.

ఎస్‌ఎస్‌ఎల్‌సీలో సత్తా చాటండి



సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విజయనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సుంకదకట్టె శ్రీనివాస నగర్‌లోని అంజలి కాన్వెంట్, నైటింగేల్ హైస్కూల్‌లో సరస్వతి పూజ, ఎస్‌ఎస్‌ఎల్‌సి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం సంబరంగా జరిగింది. సీనియర్ టీచర్ కేజీ విశ్వేశ్వరయ్య స్వాగతించారు. ముఖ్యఅతిథిగా సంస్థ కార్యదర్శి ఎంఎస్ సరళ జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీ కృష్ణేగౌడ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు చక్కగా రాణించి తమకు నచ్చిన కోర్సులను ఎంపిక చేసు కోవాలన్నారు. ఇప్పటికే ఎస్‌ఎస్‌ఎల్‌సీ ఫలితాల్లో 13వసారి వంద శాతం వచ్చాయని, 14వసారి కూడా అదేరీతిన సత్తా చాటుకోవాలన్నారు. ఇందుకు తోడ్పాటు అందించిన ఉపాధ్యాయులకు ప్రోత్సాహకధనం, జ్ఞాపిక అందచేసి సత్కరించనున్నట్టు తెలిపారు. టీచర్ ఏఆర్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార రహిత భారత్ కావాలి



పురస్కారాల గ్రహీతలతో ప్రముఖులు, నిర్వాహకులు

» అభయ సంస్థ కీలక నిర్ణయం

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యాచారాలు పెరిగి పోతున్నాయని సమాజంలో మహిళలపై దౌర్జన్యాలు సరికాదని అత్యా చార రహిత భారత్‌కోసం పాటుపడదామని పలువురు ప్రతిజ్ఞ చేశారు. అలయెన్స్ ఫ్రాంకైజ్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో విభిన్నరంగాల సాధకులకు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సౌమ్యరెడ్డి, డాక్టర్ గిరీశ్‌మూడ్, డాక్టర్ లీలామోహన్, ప్రొఫెసర్ ముఖేశ్, రాష్లి ముద్దప్ప, జయప్రకాశ్‌లు భాగస్వామ్యులయ్యారు. బెంగళూరు రోటరీ క్లబ్, బెంగళూరు స్పోర్ట్స్ లవర్స్ అసోసియేషన్, హార్ట్ ఆఫ్ గివింగ్‌తోపాటు ప్రముఖుల సహకారంతో అభయ సంస్థ సాధకులను సత్కరించింది. అభయ సంస్థ ప్రముఖులు బృందా అడిగ, ప్రాచీ కౌశిక్‌ల పర్యవేక్షణలో జ్యూరీ పురస్కారాలను సింధియా ఫెర్నాండెజ్, బ్రిజేశ్ గోఖలె, టోని జోసెఫ్‌లకు, నమ్మ ధైర్యశాలి పురస్కారాలను మాధవి సూరిభట్ల, అర్చనా సీతారాం, అనుపమ వెంకటేశ్, శాలిని రాజనాల, గ్రీష్మబన్నాల్, ఇంద్ర గాంధీరామన్, సుహాసినలకు అందించారు. నమ్మ ధైర్య శాలి పుర స్కారాలను దేవిబాల, రేణుకా హరికెరెతోపాటు పులువురికి ప్రదానం చేశారు. సమాజంలో మానత్వం కోల్పోతున్న సంఘటనలపై కలసి పోరా డాలని తీర్మానించారు. ఏడు నెలలక్రిందట అభయ సంస్థ ఆవిర్భవిం చినట్టు తెలిపారు.

పూల బొకేలు వృథా కాదు

» ఎంపీ తేజస్విసూర్య తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

» పూల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు అరవింద్

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పూలబొకేలు ఇవ్వడం వృథా కాదని దక్షిణభారత పూల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు టీఎం అరవింద్ పేర్కొన్నారు. ఎంపీ తేజస్వి సూర్య తన పెళ్లి రిసెప్షన్ వేడుకలకు సంబంధించి ఫేస్‌బుక్ లైవ్‌లో పూలబొకేలు ఇవ్వడం నేషనల్ వేస్ట్ అంటూ వ్యాఖ్యానించి వాటిని ఇవ్వవద్దంటూ వ్యాఖ్యానించారు. దీనిపై అరవింద్ స్పందిస్తూ బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. రాష్ట్రంలో సుమారు 38వేల హెక్టార్లలో పూలసాగు అవుతోందని, ప్రత్యక్షంగా పరోక్షంగా 11లక్షలమంది దీనిపై ఆధారపడ్డారన్నారు. 2.8 ఎకరాలలో కాగడాలు, మల్లి, మ్యారిగోల్డ్, సంపంగి, కనకాంబరం వంటి 40 రకాల పూలు సాగు అవుతోందన్నారు. ఆర్కిడ్స్ వంటి వాణిజ్య పంటలు పాలిహౌస్, గ్రీన్ హౌస్‌లలో సాగు చేస్తున్నారన్నారు. పూలు దిగుబడి అయ్యాక ఒక్కోసారి కనీస ధర లభించక నష్టపోతున్నారన్నారు. ఇటీవల చిక్కబళ్ళాపుర బీజేపీ ఎంపీ సుధాకర్ పార్లమెంటులో మాట్లాడుతూ చిక్కబళ్ళాపుర ప్రాంతంలో సుమారు 25వేల ఎకరాలలో పూలు సాగు అవుతున్నాయని ఇక్కడ ఫ్లోరికల్చర్ బోర్డ్ స్థాపించాలని కోరారన్నారు. పుష్పాలు ఇవ్వడం మన సంస్కృతిలో ఒక భాగమన్నారు. కాగా రెండోసారి ఎంపీ అయిన తేజస్వి సూర్య రైతులకు అండగా ఉండాలన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



భూమిపూజలో ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్‌కు సన్మానం

ముళబాగిలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు ప్రాంతమైన ముళబాగిలు తాలూకాలోని తిమ్మరావుతనహళ్ళి గ్రామ పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ వెల్లడించారు. తాలూకాలోని తిమ్మరావుతనహళ్ళి నూతన గ్రామపంచాయతీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. మరో ఐదు నెలల్లో నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. నరేగా పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా అన్ని గ్రామాలలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో జేడీఎస్ కార్యదర్శి రఘుపతిరెడ్డి, ప్రతినిధి ఎంఎస్ శ్రీనివాసరెడ్డి, ప్రముఖులు జయరామరెడ్డి, టీఆర్ శంకరపప, వెంకటరవణప్ప, గ్రామపంచాయతీ అధ్యక్షుడు వెంకటరవణప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో విజయం సాధించాలి

» పద్మశ్రీ భారతి విష్ణువర్ధన్

దొమ్మసంద్ర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు విశ్వవ్యాప్తంగా అనేక రంగాలలో విజయం సాధించి తమ గుర్తింపు పొందారని పంచభాష నటి, పద్మశ్రీ గ్రహీత డాక్టర్ భారతి విష్ణువర్ధన్ అభిప్రాయపడ్డారు. ఆనేకల్ సమీపాన అలయెన్స్ యూనివర్సిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల సాధకులకు మహిళా స్పందన అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నటి భారతి మాట్లాడుతూ సముద్రం, భూమి, ఆకాశం ఇలా హద్దులు దాటేలా మహిళలు తమ ప్రతిభను చాటాలన్నారు. తల్లిగా, సోదరిగా, కుమార్తెగా ఇలా వివిధ దశల్లో స్త్రీ తనపాత్రను పోషిస్తోందన్నారు. త్యాగమయిగా కుటుంబానికి దేశానికి ఆమె సేవలు అనన్యమన్నారు. అలయెన్స్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అభయ్‌చెబ్బి, ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్, కవితా మిశ్రా తదితరులు పాల్గొన్నారు.